www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | గురు వారం, 04 ఆగస్టు 2022 | ఎడిటర్ : గోసుకొండ వృద్విరాజు | సంపుటి - 07, సంచిక-118 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## రేవంత్ ఓ చిల్లర రాజకీయనేత

- ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ
- సోనియాను తిట్టిపోసి..ఇప్పుడు తల్లి అంటున్నాడు
- డబ్బులు పెట్టి పిసిసి పదవి తెచ్చుకున్న ఘనుడు
- సీమాంధ్ర పెట్టుబడిదారుల ప్రతినిధి రేవంత్
- రేవంత్ నాయకత్వంలో కాంగ్రెస్ కనుమరుగు తప్పదు
- కెసిఆర్‌పై పోరాడేందుకే బిజెపిలో చేరాను
- రేవంత్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన రాజగోపాల్ రెడ్డి



**హైదరాబాద్, ఆగస్ట్ 3 (సమ సమాజం):** పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి ఓ బ్లాక్మెయిలర్ అని, టిడిపి నుంచి వచ్చి సీటు కొనుక్కున్న వ్యక్తి వల్ల కాంగ్రెస్ బతికి బట్టకట్టదని, నాలుగు పార్టీలు మారిన వ్యక్తా తన మీద విమర్శలు చేసేది అని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విరుచుకుపడ్డారు. రేవంత్ నాయకత్వంలో కాంగ్రెస్ అడుగు కూడా ముందుకు కదలదని అన్నారు.రాజీనామాచేయడంతో రేవంత్ రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలను రాజగోపాల్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నోరు తెరిస్తే సోనియా తల్లి అని మాట్లాడుతున్న రేవంత్... ఆనాడు సోనియాను బలిదేవత అని నిందించలేదా అని ప్రశ్నించారు. 20 ఏళ్లు కాంగ్రెస్ పార్టీని ఇష్టమొచ్చినట్లు తిట్టి ఇవాళ... తాను సోనియా గాంధీని అవమానించారని అనడం సరికాదన్నారు. అక్రమంగా కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి ఇవాళ... పార్టీని నాశనం చేయడానికి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కొడంగల్ లో ఓడిస్తే... చావు తప్పి కండ్లు లొట్టలు పోయిన చందంగా మల్కాజిగిరిలో గెలిచారని రేవంత్ పై మండిపడ్డారు. అలాంటి వ్యక్తి తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరునేదిలేదని హెచ్చరించారు. మంచి మిత్రుడని చెబుతూనే వ్యాపారాల కోసం అమ్ముడు పోయనట్లు రేవంత్ తనను విమర్శిస్తున్నారని... ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ రేవంత్ రెడ్డి అంటూ విరుచుకు పడ్డారు. పార్టీ కోసం ఎంతో త్యాగం చేశానని, టీఆర్ఎస్ అధికారాన్ని దించడానికే తాను కాంగ్రెస్ నుంచి బయటికి వెళ్లిపోతన్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం

2వ పేజీలో

## సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌గా సురేశ్ ఎన్ పటేల్

రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ముర్ము



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 3 (సమ సమాజం):** సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌గా సురేశ్ ఎన్ పటేల్ నియమితులయ్యారు. ఈ ఏడాది జూన్ నుండి తాత్కాలిక సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. రాష్ట్రపతి భవన్‌లో సురేష్ పటేల్‌తో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణస్వీకారం చేయించారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ వేడుకకు ప్రధాని నరేంద్ర మోడీ, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరయ్యారు. సీవీసీగా పటేల్ నియామకాన్ని ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ఇటీవల ఆమోదించింది. ఏడాది కాలంగా ఈ పోస్టు ఖాళీగానే ఉంది. దీంతో ఈ ఏడాది జూన్‌లో తాత్కాలిక సీవీసీగా సురేష్ ఎన్ పటేల్ ని నియమించారు. ఆంధ్రా బ్యాంక్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అయిన పటేల్.. ఏప్రిల్ 2020లో విజిలెన్స్ కమిషనర్‌గా నియమితు లయ్యారు. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్) మాజీ అధికారి సంజయ్ కొఠారీ గత ఏడాది జూన్ 24న సీవీసీగా పదవీకాలం పూర్తి చేశారు. సీవీసీ, విజిలెన్స్ కమిషనర్లను నిర్ణయించేందుకు ప్రధాని నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల సెలక్షన్ ప్యానెల్ జూలైలో సమావేశమైంది. ఈ సమావేశంలో సీవీసీగా పటేల్ నియామకాన్ని ప్యానెల్ ఆమోదించింది.విజిలెన్స్ కమిషనర్లుగా మాజీ ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ అరవింద్ కుమార్, మాజీ వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి అవినాష్ కుమార్ శ్రీవాస్తవ నియామకాలకు కూడా ప్యానెల్ ఆమోదం తెలిపింది. అరవింద్ కుమార్ ఈ ఏడాది జూన్ 30న అంతర్గత భద్రతా గూఢచార సంస్థ చీఫ్‌గా పదవీకాలం పూర్తి చేశారు. అవినాష్ కుమార్ శ్రీవాస్తవ ఉత్తరప్రదేశ్ కేడర్‌కు చెందిన 1982 బ్యాచ్ అధికారి, జనవరి 2020లో వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శిగా పదవీ విరమణ చేశారు.

## మేడ్చల్‌లో 50 పడకల ప్రభుత్వా ఆసుపత్రి



మంత్రి మల్లారెడ్డితో కలసి హరీష్ శంకుస్థాపన

వైద్యం కోసం పెద్ద ఎత్తున నిధుల వెచ్చింపు

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీరుపై మంత్రి ఆగ్రహం

**మేడ్చెల్, ఆగస్ట్ 3 (సమ సమాజం):** మేడ్చల్‌లో 50 పడకల ఎంసీహెచ్ దవాఖానకు హరీశ్‌రావు కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. మేడ్చల్ బాగా విస్తరిస్తుందని, మంచి హాస్పిటల్ కావాలని కోరారన్నారు. దవాఖానకు కొత్తగా ఎనిమిది మంది వైద్యులు, 16 మంది స్టాఫ్‌నర్సులతో పాటు 50 మంది సిబ్బంది అదనంగా ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే అదనంగా బిల్డింగ్ ఇస్తామని, ఏడున్నర కోట్లతో శంకుస్థాపన చేశామని, ఎనిమిది నెలల్లో పూర్తి చేస్తామన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో కాన్పు అయితే.. 30వేల నుంచి 50వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. ప్రభుత్వ హాస్పిటల్‌లో ఉచిత వైద్యసేవలు అందిచడంతో పాటు కేసీఆర్ కిట్, రూ.13వేలు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు చెప్పారు. ముహూర్తం చూసి కాన్పునకు వెళ్తే తల్లీబిడ్డకు నష్టమని హెచ్చరించారు. పెద్ద ఆపరేషన్ చేయమని వైద్యులపై ఒత్తిడి చేస్తున్నారని, దీంతో తల్లి ఆరోగ్యం దెబ్బతింటుందని, ఏ పని చేయలేని పరిస్థితి ఉంటుందన్నారు. 40 సంవత్సరాలకే అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ప్రాణానికి హాని ఉంటేనే డాక్టర్లు ఆపరేషన్ చేయాలా? వద్దా? అని నిర్ణయిస్తారన్నారు. అమెరికాలాంటి దేశాల్లో 20-30 శాతమే ఆపరేషన్లు జరుగుతున్నాయన్నారు. ఇక్కడ 70-80 శాతం ఆపరేషన్లు చేస్తున్నారని, దీంతో పిల్లలకు నష్టమన్నారు. తొలి గంటలో తల్లిపాలు బిడ్డకు పట్టించడం టీకాలంటిదని, పెద్ద ఆపరేషన్‌తో తల్లిపాలు తాగే అవకాశం బిడ్డ కోల్పోతుందన్నారు. దాంతో రోగ నిరోధకశక్తి పిల్లల్లో తగ్గుతుందన్నారు. గాంధీలో 250, నిమ్స్ లో 250 పడకల మాతా శిశు

2వ పేజీలో

## విధి నిర్వహణలో ఉండగా ఎస్‌ఐ పై దాడి

అర్థరాత్రి మారేడుపల్లి ఎస్‌పై బ్లేడుతో దాడి

గాయాలైన ఎస్‌ఐ ఆస్పత్రికి తరలింపు



**హైదరాబాద్, ఆగస్ట్ 3 (సమ సమాజం):** అర్థరాత్రి విధుల్లో ఉన్న ఎస్‌ఐపై ఇద్దరు దుండగులు దాడిచేశారు. నగరంలోని మారేడుపల్లి ఎస్‌ఐపై దుండగులు బ్లేడ్‌తో దాడికి పాల్పడ్డారు. ఎస్‌ఐ వినయ్‌పై బ్లేడ్‌తో మారేడ్‌పల్లి ఓం శాంతి హోటల్ దగ్గర అర్థరాత్రి దాడి ఘటన చోటుచేసుకుంది. నంబర్ ప్లేట్ లేని వాహనాన్ని ఎస్‌ఐ ఆపే ప్రయత్నం చేశారు. వాహనం ఆపుతుండగా ఎస్‌ఐపై దుండగుల దాడికి పాల్పడ్డారు. గాయప డిన ఎస్‌ఐని ప్రైవేట్ ఆస్పత్రికి

2వ పేజీలో

## టిఆర్‌ఎస్‌లోకి వలసల పర్వం

గాదరి కిషోర్ సమక్షంలో చేరికలు

**నల్లగొండ, ఆగస్ట్ 3 (సమ సమాజం):** టీఆర్‌ఎస్‌లోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి టీఆర్‌ఎస్‌లో భారీగా చేరుతున్నారు. తాజాగా నల్లగొండ జిల్లాలోని శాలిగౌరారం మండలంలోని ఇటుకులపాడ్, శాలిగౌరారం గ్రామాలకు చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు నాయకులు తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ సమక్షంలో టీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి తగిన గౌరవం ఉంటుందన్నారు. పార్టీ పటిష్ఠత కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్దిదారులకు అందజేసారు. అనంతరం దళిత బంధు పథకం ద్వారా మంజూరైన వాహనాన్ని లబ్దిదారుడికి అందజేశారు.

## రేవంత్ చిల్లర రాజకీయ నాయకుడు

బ్లాక్‌మెయిల్‌తో రాజకీయాల్లో ఎదిగాడు

రాజగోపాల్‌రెడ్డిని విమర్శించడం ఎంతవరకు సబబు

12మంది టిఆర్‌ఎస్‌లో చేరితే కాంగ్రెస్ ఏం చేసింది

కెసిఆర్ అహంకారంపైనే మునుగోడులో పోటీ

మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ఈటెల రాజేందర్



**హైదరాబాద్, ఆగస్ట్ 3 (సమ సమాజం):** రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతూ రాజకీయంగా ఎదిగారని, ఇది ప్రపంచానికి తెలిసిన విషయమని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తెలిపారు. రేవంత్ నాలుగు పార్టీలు మారలేదా అని సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్÷-ని వాడుకొని ముఖ్యమంత్రి అవ్వాలని చూస్తున్నదని నిజం కాదా అని ఘాటుగా విమర్శించారు. రేపు మునుగోడులో జరిగే ఉప ఎన్ని వ్యక్తులో లేదా పార్టీల మధ్యో కాదని, అది కెసిఆర్ అహంకారానికి,ప్రజలకు మధ్య జరుగుతుందని అన్నారు. బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలు దొందు దొందేనని.. వాళ్లు కలిసే పని చేస్తున్నారని ఈటల రాజేందర్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై విమర్శలు చేయడం తగదన్నారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ నేతలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన అనంతరం రాజగోపాల్ రెడ్డిపై టీపీసీసీ చీఫ్ రేవంత్ పలు విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. దీనిపై ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడుతూ 12 మంది ఎమ్మెల్యేలను టీఆర్ఎస్ పార్టీలో చేర్చుకోలేదా అని ప్రశ్నించారు. అప్పుడు ఏమయ్యారని అన్నారు. రాజగోపాల్ రెడ్డిపై రేవంత్ విమర్శలు చేయడం సబబు కాదన్నారు. మాతో ఎమ్మెల్యేలంతా టచ్‌లో ఉన్నారని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పార్టీలోకి రావాలని ఆనాడే రాజగోపాల్ రెడ్డిని అడిగినట్లు.. కానీ దానికి ఆయన ఒప్పుకోలేద న్నారు. మునుగోడులో జరిగే ఎన్నికలు వ్యక్తుల మధ్య జరగడం లేదని, కేసీఆర్ అహంకారానికి మధ్య జరుగుతుందన్నారు. తెలంగాణ ఉద్యమం కోసమే తాము పని చేయడం జరుగుతుందని ఆనాడు ఆయన స్పష్టం చేశారన్నారు.

2వ పేజీలో

## పార్టీలోకి ఎవ్వరు వచ్చినా స్వాగతిస్తాం

ఉద్యమకారులను ఆహ్వానిస్తున్నాం: బండి



**యాదాద్రి, ఆగస్ట్ 3 (సమ సమాజం):** భారతీయ జనతా పార్టీలోకి ఎవరొచ్చినా స్వాగతిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. భువనగిరి మండలం బస్వాపురం శివారు నుంచి ప్రజా సంగ్రామ యాత్ర ప్రారంభించడానికి ముందు బండి సంజయ్ మాట్లాడారు. ఉద్యమకారులను స్వాగతించే పార్టీ భారతీయ జనతా పార్టీ అని బండి సంజయ్ అన్నారు. పార్టీలోకి వచ్చే వారికి సముచిత స్థానం, గౌరవం ఇస్తామని చెప్పారు. టీఆర్ఎస్ పార్టీతో కొట్లాడే పార్టీ బీజేపీ మాత్రమే అన్నారు. తెలంగాణ ఏ ఆశయం కోసం ఏర్పడిందో ఆ ఆశయ స్ఫూర్తిని ముఖ్యమంత్రి కేసీఆర్ దెబ్బతీస్తున్నారని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ మాత్రమే టీఆర్ఎస్ కు వ్యతిరేకంగా పోరాడుతుందని తెలిపారు. అన్ని వర్గాల కోసం బీజేపీ కొట్లాడుతుందన్న ఆయన.. ఉద్యమ ఆకాంక్షను తీర్చే పార్టీ భారతీయ జనతాపార్టీ అని ప్రజలు గుర్తిస్తున్నారని చెప్పారు.

## తెలంగాణ చంద్రబాబు రేవంత్

సొంత ఎమ్మెల్యేలను కాపాడుకోలేని కాంగ్రెస్

రాజగోపాల్ రెడ్డి చేరికను తట్టుకోలేని రేవంత్

మండిపడ్డ బిజెపి నేతల డికె అరుణ



**హైదరాబాద్, ఆగస్ట్ 3 (సమ సమాజం):** రేవంత్ రెడ్డిని తెలంగాణ చంద్రబాబుగా ప్రజలు భావిస్తున్నారని బీజేపీ నేత డీకే అరుణ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో పుట్టి పెరిగినోడి లెక్క రేవంత్‌రెడ్డి మాట్లాడం హాస్యాస్పదమని.. తన భాష మార్చుకోవాలని చెప్పారు. రాజగోపాల్ రెడ్డి బీజేపీలో చేరనుండటం రేవంత్ రెడ్డి జీర్ణించుకోలేపోతున్నాడని..అందుకే ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఉద్యమం లో సోనియా, రాహుల్ పై రేవంత్ చేసిన కామెంట్స్ వీడియోను ఆమె ప్లే చేసి చూపించారు. సోనియా గాంధీని బలిదేవతగా అభివర్ణించిన రేవంత్ మాటలను ప్రజలు మర్చిపోలేదన్నారు. దేశ ప్రజల విశ్వాసాన్ని కాంగ్రెస్ కోల్పోయిందని..బీజేపీని మాత్రమే ప్రజలు నమ్ముతున్నారని డీకే అరుణ అన్నారు. ఈడీ, సీబీఐలతో వేధించి ఎంతోమందిని జైలుకు పంపిన చరిత్ర కాంగ్రెస్‌ది అని అన్నారు. అమిత్ షాను గుజరాత్ నుంచి బహిష్కరించడాన్ని సుప్రీం తప్పుబట్టిన సంగతి రేవంత్ తెలుసుకోవాలని చెప్పారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా దొడ్డిదారిన కాంగ్రెస్ లో చేరిన చరిత్ర రేవంత్ రెడ్డిదని విమర్శించారు. టీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనన్న విషయం రాష్ట్రపతి ఎన్నికలతో రుజువైందన్నారు. తెలంగాణను ఏర్పాటును కాదు..రాష్ట్ర విభజన తీరును మాత్రమే మోదీ పార్లమెంట్ లో తప్పుబట్టారని తెలిపారు.

2వ పేజీలో

## ఢిల్లీలో తిరంగా ర్యాలీని ప్రారంభించిన వెంకయ్య

రెడ్ ఫోర్ట్ నుంచి విజయ్‌చౌక్ వరకు ర్యాలీ❒ర్యాలీలో పాల్గొన్న కేంద్రమంత్రులు,ఎంపిలు



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 3 (సమ సమాజం):** చారిత్రక రెడ్ ఫోర్ట్ నుంచి అన్ని పార్టీలకు చెందిన ఎంపీలు బుధవారంనాడు 'తిరంగా బైక్ ర్యాలీ'లో పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. సాంస్కృతిక శాఖ ఏర్పాటు చేసిన తిరంగా బైక్ ర్యాలీ పార్లమెంటు సమీపంలోని విజయ్ చౌక్‌కు చేరుకోవడంతో ముగిసింది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్వాతంత్య్ర సమరయోధుల స్మృత్యర్థం నిర్వహించిన ఈ ర్యాలీలో పలువురు ఎంపీలు, కేంద్ర మంత్రులు, యువ పార్లమెంటేరియన్లు పాల్గొన్నారు. పౌరుల్లో దేశభక్తి భావనలను మరింత ఉత్తేజపరిచేందుకు ఈర్యాలీని నిర్వహించారు. ర్యాలీ మార్గంలో త్రివర్ణపతాకాలు రెపరెపలాడగా, ఎంపీలు తమ బైక్‌లకు త్రివర్ణ పతాకాలను తగిలించుకుని ఉత్సాహంగా ఇందులో పాల్గొన్నారు.కాగా, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఆగస్టు 13

2వ పేజీలో

## సంపాదకీయం

# విద్యుత్ దుబారాను అరికట్టాల్సిందే !

వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ మీటర్లు బిగింపుపై ఏపి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సమర్థిం చాల్సిందే. సిఎం జగన్ ఇటీవల దీనిపై గట్టిగానే నిర్ణయం తీసుకున్నారు. విద్యుత్ ఉచితమే అయినా ఆడిట్ జరగాల్సిందే. ఏ రైతు ఎంత విద్యుత్ వాడుతున్నాడో తెలియాలి. అలాగే ఎంత విద్యుత్ ఖర్చవుతుందో తెలుసుకోవాల్సిన అవసరం కూడా ఉంది. విద్యుత్ పేరుతో ఇతరత్రా పనులకు విద్యుత్ వినియోగిస్తున్నారా అన్నది కూడా తెలుసుకోవాలి. ఇది కేంద్రం ఒత్తిడి వల్ల జరుగుతోందని తెలంగాణ ప్రభుత్వం వాదిస్తున్నా.. విద్యుత్ అక్రమాలు జరగడానికి లేదు. ఉచిత విద్యుత్‌ను కేవలం వ్యవసాయానికే వాడాలి. ఇందులో కూడా పారదర్శకత రావాలి. దీంతో పాటు ఒక్కో రైతుకు ఎంత భూమి ఉంది..ఏయే పంటలు వేస్తున్నారన్నది తెలుసుకోవాలి. నిజంగానే ఉచిత విద్యుత్ సద్వినియోగం అవుతుందా లేదా అన్నది కూడా ముఖ్యమే. ఏ పథకం కూడా దుబారా కారాదు. ఇలా కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఈ ఉచిత విద్యుత్ ఖర్చులో ప్రజల భాగస్వామ్యం ఉంది. మీటర్ల విషయంలో రైతుల ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే మీటర్లు బిగించినా ఉచిత విద్యుత్ కొనసాగుతుందని ప్రభుత్వమే చెబుతోంది. ఒకవేళ దీనిని నిలిపివేస్తే అప్పుడు ఆందోళనలు చేయాలి. నిరసనలు వ్యక్తం అవుతున్నా ముందుకే వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వెళ్లడం సమంజసం కాదని అంటున్న వారు రాజకీయం చేయడం తప్పమరోటి కాదు. ఉచిత విద్యుత్ అసాధ్యమన్న టిడిపి ఇప్పుడు మీటర్ల బిగింపును వ్యతిరేకించడం కూడా సరికాదు. విద్యుత్ రాయితీలకు మంగళం పాడేలా చేస్తున్నారని విమర్శించడం సరికాదు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల్లో భాగంగా స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నా అది మంచిదే. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శ్రీకాకుళంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన తీరు మంచి ఫలితాలు ఇస్తోంది. విద్యుత్ ఆదా అవుతోందని కూడా ప్రభుత్వం చెబుతోంది. నిజానికి మీటర్లు బిగించి రైతులకు అకౌంటబులిటీ విధించాల్సిందే. అయినా ప్రభుత్వం ముందుకెళ్లింది. కర్నూలులో, అనంతపురంలో కూడా అన్నదాతలు మీటర్ల బిగింపుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కానీ ప్రభుత్వం ఒక స్థిరన నిర్ణయం ముందుకెళ్తోంది. ఈ క్రమంలోనే వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ మీటర్లు బిగిస్తే జరిగే మేళ్లపై రైతులకు అవగాహన కల్పించాలని, లేఖలు రాయాలని ఇంధన శాఖపై జరిగిన సమీక్షా సమావేశంలో ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. రైతాంగ ఆందోళనలపై వారికి అవగాహన కలిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ అమల్లోకి తీసుకొచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించినా ఇప్పుడు తెలుగు రాష్ట్రాలు దానిని కొనసాగిస్తున్నారు. ఉచిత విద్యుత్‌కే ఎసరు పెట్టే మీటర్ల బిగింపును సమర్థించు కోవడం సిగ్గుచేటని టిడిపి చేస్తున్న వాదనలో పసలేదు. ఏ రాష్ట్రం అయినా పారదర్శక విధానాలు అవలంబించాలి. రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణాలు, వాటికి అవసరమయ్యే విద్యుత్ వంటి విషయాల్లో నిజాయితీ ఉండాలి. ఓ అవగాహన ఉండాలి. ప్రాజెక్టుల పనులు వేగంగా సాగుతున్న నేపథ్యంలో విద్యుత్ ప్లాంట్ల పనులు అదేస్థాయిలో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఇరు తెలుగు రాష్ట్రాలపై ఉంది. రాష్ట్రంలో ఉన్న విద్యుత్ అవసరాల దృష్ట్యా నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని తెలంగాణ సిఎం కెసిఆర్ ఇప్పటికే ఆదేశించారు. విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం, విద్యుత్ సంస్థల అనుసంధానం తదితర అంశాల విషయంలో దూరదృష్టితో సాగాలి. ఇకపోతే తెలంగాణలో వ్యవసాయానికి 24గంటల విద్యుత్ సరఫరా విషయంలో రాజీపడబోమని సిఎం కేసీఆర్ ప్రకటించారు. మీటర్లు బిగించబోమని అన్నారు. మీటరల్‌ఉ బిగించడం ద్వారా ఆడిట్ కోసం అన్న విషయాన్నిప్రభుత్వాలు గుర్తించాలి. రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తూనే ఎంతమేరకు ఎవరికి ఇస్తున్నారో లెక్క చేయాల్సిందే. తెలంగాణలో 2018 జనవరి 1వ తేదీ నుంచి వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేస్తున్నారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేసుకుని ముందుకు సాగుతున్నారు. 24 గంటల విద్యుత్ సరఫరా కోసం డిస్కం అధికారులు పలు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా 24 గంటల కరెంట్ అమలు చేసి ఫలితాలను పరిశీలించారు. ఇకపోతే ఇందులో ప్రధానమైనది రైతులు ఆటోమేటిక్ స్టార్టర్లను వినియోగం. వీటిని నిషేదించాలని ప్రభుత్వం నిర్ణయించినా ఇప్పటికీ అమలు కావడం లేదు. గతంలో విద్యుత్ సరఫరాలో నిరంతరం కలుగుతున్న అంతరాయంతో విసిగిపోయిన అన్నదాతలు ఆటోమేటిక్ స్టార్టర్ల వైపు మొగ్గు చూపారు. కరెంట్ వచ్చిన ప్పుడు, పోయినప్పుడు ఆటోమేటిక్ స్టార్టర్లు ఆన్, ఆఫ్ అయ్యేవి. దీనితో మాటి, మాటికి కలిగే ఇబ్బందుల నుండి రైతులకు కొంత వెసులుబాటు కలిగింది. దీనిని దృష్టిలో పెట్టుకునే రైతులు ఆటోమేటిక్ స్టార్టర్లు ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. అందుకే రైతులు వినియోగిస్తున్న ఆటోమేటిక్ స్టార్టర్లను స్వచ్ఛందంగా తొలిగిస్తే విద్యుత్ సరఫరాలో కలిగే అంతరాయాలను నియంత్రించవచ్చని డిస్కం అధికారులు సూచిస్తున్నారు. తెలంగాణలో 24 గంటల విద్యుత్ సరఫరా అమల్లోకి రావడంతో విద్యుత్ వినియోగం నెలకు సుమారు 40 శాతం అదనంగా పెరిగిందన్న అంచనాలు ఉన్నాయి. భారీగా పెరగుతున్న వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని పొదుపు అలవర్చుకుంటే ఆర్థికంగా వెసులుబాటు కూడా కలుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు. 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరాకు టీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నా అకౌంటబులిటీ విషయంలో రాజీపడరాదు. కాబట్టి ఉచిత విద్యుత్ అనేది హక్కుగా కాకుండా రైతులను ఆదుకునే ప్రయత్నంగా మాత్రే ఉండాలి. విద్యుత్ ఖరీదైన విషయంగా గుర్తించాలి. గృహ వినియోగదారులను ముక్కుపిండి వేలకోట్లు వసూలు చేస్తున్న ప్రభుత్వాలు దుబారాల విషయంలోనూ జాగ్రత్తగా ఉండాల్సిందే.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# వైద్యులు వృత్తికి న్యాయం చేయాలి

**వైద్యపరికరాలు లేవన్న సాకుతో సేవలు ఆపరాదు**

**ఆధునీకరించిన ఇఎస్ఐ ఆస్పత్రిని ప్రారంభించిన హరీష్ రావు**



**సంగారెడ్డి, ఆగస్ట్ 3 (సమ సమాజం):** పేదలకు వైద్యం అందించడంలో ప్రభుత్వ డాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని మంత్రి హరీశ్ రావు అన్నారు. వైద్య పరికరాలు లేవనే సాకుతో పనిచేయకపోవడం మంచిది కాదన్నారు. వృత్తికి న్యాయం చేయాలని వైద్యులను కోరారు. సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురంలో రూ.20 కోట్లతో ఆధునీకరించిన ఈఎస్ఐ దవాఖానను మంత్రి మంత్రి మల్లారెడ్డితో కలిసి హరీశ్ రావు ప్రారంభించారు. పటాన్‌చెరు ప్రాంతంలోని కార్మికులకు ఈఎస్ఐ దవాఖానాలో అన్నిరకాల వైద్య సదుపాయాలు కల్పించడం సంతోషంగా ఉన్నారు. అనంతరం దవాఖానను పరిశీలించారు.అయితే ఇఎస్ఐ దవాఖాన పనితీరుపై మంత్రి హరీశ్ రావు అసహనం వ్యక్తం చేశారు. దవాఖాన వివరాలు ఇవ్వకపోవడంతో సూపరింటెండెంట్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. నలుగురు వైద్యులు నాలుగేండ్లుగా విధులకు రావడంలేదని, వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అదేవిధంగా హాస్పిటల్‌లో ప్రసవాలు ఎందుకు చేయడం లేదని సూపరింటెండెంట్‌ను నిలదీశారు. జూలై నెలలో మూడు డెలివరీలు మాత్రమే చేయడంపై సీరియస్ అయ్యారు. ఇక్కడ పనిలేకుండే పటాన్‌చెరు దవాఖానలో డ్యూటీ చేయాలని ఆదేశించారు. హాస్పిటల్‌లో డాక్టర్లు ఫుల్‌గా ఉన్నప్పటికీ పేషెంట్లు నిల్ అని చెప్పారు. వైద్యపరికరాలు లేవనే సాకుతో డాక్టర్లు పనిచేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం కేసీఆర్ చొరవతో రాష్ట్రంలోని కార్మికుల సంక్షేమం కోసం ఈఎస్ఐ హాస్పిటళ్లను పటిష్ఠం చేస్తున్నామని మంత్రి మల్లారెడ్డి అన్నారు. అందరికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని చెప్పారు. రామచంద్రపురం ఈఎస్ఐ దవాఖానలో ఆధునీకరణ పనులు పూర్తవడం సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే పటాన్‌చెరులో 30 పడకల ఈఎస్ఐ దవాఖాన నిర్మిస్తామన్నారు.

# రేవంత్ చిల్లర రాజకీయ నాయకుడు

(మొదటి పేజీ తరువాయి) కాంట్రాక్టు రద్దు చేసినా.. ఆర్థికంగా ఇబ్బందులు పెట్టినా కట్టుబడి పని చేసిన వ్యక్తి రాజగోపాల్ రెడ్డి అని తెలిపారు. వాస్తవానికి దేశంలో కాంగ్రెస్ పార్టీ అంతరించబోతోందన్నారు. కర్నాటక, మహారాష్ట్ర, ఏపీ, తెలంగాణ..ఇలా ఏ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందా అని నిలదీశారు. ముఖ్యమంత్రులను అవమానించిన పార్టీ ఏదైనా ఉందంటే.. అది కాంగ్రెస్సేనని విమర్శించారు. మహారాష్ట్రలో సిద్ధాంతాన్ని పక్కన పెట్టి.. శివసేన, ఎన్సీపీ పార్టీలతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పొత్తుపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారని, ఏక్ నాథ్ షిండే తన ధర్మాన్ని, కర్తవ్యాన్ని నిర్వర్తించడం జరిగిందన్నారు. ఉత్తర్ ప్రదేశ్ లో కేవలం రెండు స్థానాలకు పార్టీ పరిమితమైందని, అక్కడ రాహుల్ ను ప్రజలు తిరస్కరించారని విమర్శించారు. కేరళకు వెళ్లి ఎంపీ అయ్యారనే విషయాన్ని ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. సర్పంచ్, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు నిధులున్నాయా ఉత్సవ విగ్రహాలుగా మారారని వ్యాఖ్యానించడం తప్పా అని నిలదీశారు. టీఆర్ఎస్ కు తామే ప్రత్యామ్నాయం తామేనంటూ.. కాంగ్రెస్ గొప్పలు చెప్పుకొంటోందన్నారు. ప్రాంతీయ పార్టీలతో కాంగ్రెస్ పొత్తులు పెట్టుకుని... పోటీ చేసిన రాష్ట్రాల్లో టీఆర్ఎస్ సహకరించ లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెస్, టీఆర్ఎస్ కలిసి పని చేయలేదా, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో అదే విధంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. ఇవన్నీ మరచిపోయి ఇప్పుడు బిజెపిని విమర్శించడం తగదన్నారు. బిజెపి ఓ సిద్ధాంతంకోసం పనిచేస్తుందన్నారు.

## ఢిల్లీలో తిరంగా ర్యాలీని ప్రారంభించిన వెంకయ్య



(మొదటి పేజీ తరువాయి) నుంచి 15 వరకూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద త్రివర్ణ పతాకాలను ఎగురవేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరారు. పార్టీ సభ్యులు బూత్ స్థాయిల్లో ఆగస్టు 11 నుంచి 13వ తేదీ వరకూ 'రఘపతి రాఘవ రాజారాం' దేశభక్తి గీతాన్ని ఆలపిస్తూ ప్రభాత్ ఫేరి నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు స్మృతి ఇరానీ,అనురాగ్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ ఓ చిల్లర రాజకీయనేత

(మొదటి పేజీ తరువాయి) తనకు కాంట్రాక్టు ఇచ్చిందని రేవంత్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. డబ్బు కోసమే తాను బీజేపీలోకి చేరుతున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారన్న ఆయన..డబ్బు కోసమే బీజేపీకి వెళు న్నానని నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తానని ఆయన అన్నారు. ఒకవేళ నిరూపించకపోతే రేవంత్ తన పీసీసీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని సవాలు విసిరారు. తనకు దక్కిన టెండర్ ఓపెన్ టెండర్లలో భాగంగానే వచ్చింది కానీ మరేమీ కాదన్నారు. రేవంత్ నోటికి హద్దు అదుపు లేకుండా మాట్లడుతున్నారన్న ఆయన... ఒక కులాన్ని పొగడుతూ మిగతా కులాలను రేవంత్ కించపరిచారని ఆరోపించారు. తాను రేవంత్ కు పీసీసీ అధ్యక్షుడి పదవి ఇవ్వాలని చెప్పిన దాంట్లో ఏమాత్రం నిజం లేదన్నారు. అసలు ఆయన ఎప్పుడూ తన ఇంటికి రాలేదని తెలిపారు. కాంగ్రెస్ తన గుత్తాధిపత్యం అయినట్లు రేవంత్ వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. తనను పండబెట్టి తొక్కుతా అని రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారన్న ఆయన.. మూడు ఫీట్లు ఉన్న రేవంతా తనను తొక్కేది అంటూ ఫైర్ అయ్యారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితవు పలికారు. తాను ఎక్కడికిపోయిన సీఎం సీఎం అంటూ సొంత డబ్బా కొట్టించుకుంటారని ఆరోపించారు. తమ బ్రాండ్ గురించి మాట్లాడే అర్హత రేవంత్ కు లేదన్న ఆయన... అలాంటి చిల్లర వ్యక్తుల గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదన్నారు. హుజురాబాద్‌లో ప్రచారం చేస్తే మూడు వేల ఓట్లు కూడా సాధించలేకపోయారని విమర్శించారు. తనది కాంగ్రెస్ రక్తం కాదని, అవకాశ రాజకీయాలు చేస్తున్నారని రేవంత్ పై రాజగోపాల్ రెడ్డి విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి వెనుక ఉన్నది చంద్రబాబు, సీమాంధ్ర పెట్టుబడి దారులని అన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అసలే గెలవదన్న ఆయన... ఆత్మ గౌరవమున్న తనలాంటి నాయకులు పార్టీ నుంచి బయటికి పోతన్నట్లు చెప్పారు. రేవంత్ రెడ్డి లాంటి చిల్లర వ్యక్తుల ఆధ్వర్యంలో పనిచేసేదిలేదని స్పష్టం చేశారు. అందుకే కేసీఆర్ కు వ్యతిరేకంగా పోరాడేందుకు... మోడీ, అమిత్ షా నాయకత్వంలో పని చేయనున్నట్లు స్పష్టం చేశారు. మునుగోడు ఉపఎన్నికలో కాంగ్రెస్ కు డిపాజిట్ కూడా రాదని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ లో ఎవరూ సంతోషంగా లేరన్న ఆయన... తన దిష్టి బొమ్మలు దగలబెట్టాలని చెప్పిన వాళ్లు ఎమ్మెల్యేగా గెలిచారా అని ప్రశ్నించారు. సంబరాలు చేసినవారికి మొన్న హుజురాబాద్ లో ఎన్ని ఓట్లు వచ్చాయో చూడాలన్నారు. మునుగోడు ప్రజలే రేవంత్ కు బుద్ధి చెబుతారని రాజగోపాల్ రెడ్డి హెచ్చరించారు.

## తెలంగాణ చంద్రబాబు రేవంత్

(మొదటి పేజీ తరువాయి) సొంత ఎమ్మెల్యేలను కాపాడుకోలేని అసమర్థత కాంగ్రెస్ ది అని డీకే అరుణ అన్నారు. హుజురాబాద్ మాదిరి మునుగోడులో కాంగ్రెస్ కు డిపాజిట్ కూడా దక్కదన్నారు. ఉపఎన్నిక వస్తేనే అభివృద్ధి జరుగుతోందని మునుగోడు ప్రజలు నమ్ముతున్నారు. సింపతి కోసమే అధికార పార్టీ ఎమ్మెల్యేలు తమపై హత్యాప్రయత్నాలు చేయించుకుంటున్నారని ఆరోపించారు. ఓటమి భయం అధికార టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వేధిస్తోంది.

## కాళేశ్వరం ఎటిఎం అన్నారు సరే...

**కెసిఆర్ అవినీతిపై ఎందుకు చర్య తీసుకోరు**

**ట్విట్టర్ వేదికగా కేంద్రమంత్రి షెకావత్‌కు రేవంత్ ప్రశ్న**



**హైదరాబాద్, ఆగస్ట్ 3 (సమ సమాజం):** షెకావత్ జీ, కాళేశ్వరం కేసీఆర్ కు ఏటీఎంలా మారింది నిజమేనని గుర్తించారని టీపీసీసీ చీఫ్, మల్కాజ్ గిరి ఎంపీ రేవంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలు, చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికే జాతీయ హోదా ఇవ్వాలని కేసీఆర్ డిమాండ్ చేస్తున్నారని కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ఇటీవల అన్న వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కమీషన్ల కోసమే కేసీఆర్ కాళేశ్వరం కట్టారు. అది కూడా నిజమేనన్న ఆయన... కాళేశ్వరం ప్రాజెక్టుకు టెక్నికల్ పర్మిషన్లు, పర్యావరణ పరిమితులు లేవన్న కేంద్ర మంత్రి వ్యాఖ్యలను రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కాళేశ్వరం డిజైన్ లోపంతోనే మునిగింది. కానీ.. కేసీఆర్ దోపిడీ,- అవినీతిపై మీరు చర్యలు తీసుకోరు? ఇదైతే నికార్సయిన నిజం! అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తిమాటలు కట్టిపెట్టి ? గట్టి చర్యలు తలపెట్టండి! అంటూ రేవంత్ రెడ్డి షెకావత్ కు గట్టి రిప్లై ఇచ్చారు. ఇంతకంటే ముందు కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణ ఎందుకు జరపడం లేదని కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ను రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎందుకివ్వడం లేదన్నారు. కృష్ణ, గోదావరిలో తెలంగాణ నీటి వాటా ఎందుకు తేల్చడం లేదంటూ నిలదీశారు. వీటికి సమాధానం చెప్పేవరకు ప్రజలు బీజేపీని నమ్మరని రేవంత్ ట్వీట్ చేశారు.



# మేడ్చల్‌లో 50 పడకల ప్రభుత్వా ఆసుపత్రి

(మొదటి పేజీ తరువాయి) కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తున్నట్లు మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. అత్యాధునిక సేవలు అందుబాటులోకి తెస్తున్నట్లు పేర్కొన్నారు. పేదలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి అప్పులపాలు కావొద్దని, వేలకోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. బస్తీల్లో డాక్టర్లను నియమించి.. పేదల సుస్తిని పోగొట్టేందుకు బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మేడ్చల్‌లో 13 బస్తీ దవాఖానలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. మరో పది రోజుల్లో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. నార్మల్ డెలివరి చేస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులకు, స్టాఫ్ నర్సుకు, ఆశ వర్కర్లకు ప్రోత్సహకాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలు రక్త హీనతతో బాధపడుతున్నారని, సరైన భోజనం లేక కాన్పు సమయంలో ఇబ్బందులుపడుతున్నారన్నారు. నిరుపేదలకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పేదలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. గాంధీ, ఉస్మానియాతో పాటు నగరంలో 18 ఆసుపత్రుల్లో నిత్యం 30వేల మంది పేషెంట్లతో వచ్చే సహాయకులకు భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బీబీ నగర్ వెళ్లి ఎయిమ్స్ ఆసుపత్రి దగ్గర అడ్డగోలుగా మాట్లాడరని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఎయిమ్స్ ప్రతిష్టాత్మక సంస్థ అని, రాష్ట్ర ప్రభుత్వం ఎయిమ్స్ పెడతమంటే 201 ఎకరాల భూమి ఇచ్చిందని, 200 పడకల ఆసుపత్రి ఇచ్చిందన్నారు. నాలుగేళ్లయినా ఇవాల్టికి ఒక్క కాన్పు చేయలేదన్నారు. ఆపరేషన్ థియేటర్ లేదని, బ్లడ్ బ్యాంక్ లేదని, మెడికల్ స్టూడెంట్స్ వచ్చారని, వారు ఏం చదువుకోవాలని ప్రశించారు. బీజేపీ ప్రభుత్వం ఉద్ధరిస్తోందని చెప్పుకుంటున్నారని.. విద్యార్థులు ఎందుకు చేరామని నెత్తి పట్టుకుంటున్నారన్నారు. తాము ఎయిమ్స్‌లో చేయమని అంటున్నారని.. ఉస్మానియా, గాందీలో చేర్చుకోవాలని కోరుతున్నారని.. కిషన్‌రెడ్డి ఎయిమ్స్ వెళ్లి చూడాలన్నారు. ఎయిమ్స్ పరువు తీశారని, కేంద్రం దిగజార్చిందని హరీశ్‌రావు మండిపడ్డారు. భువనగిరి ఏరియా ఆసుపత్రిలో 1083 డెలివరీలు అయ్యాయని, రామన్నపేట ఏరియా ఆసుపత్రిలో 245 డెలివరీలు జరిగాయన్నారు. బీబీనగర్ ఎయిమ్స్ ఉన్న అర్బన్ పీహెచ్‌సీలో 13 అయ్యాయని తెలిపారు. ఎయిమ్స్‌లో ఒక్క డెలివరీ కాలేదని.. ఇది మీ బీజేపీ, కేంద్ర ప్రభుత్వ పనితీరు అంటూ మంత్రి ధ్వజమెత్తారు. పని చేసే వైద్యులను తగ్గించేలా మాట్లాడడం సరికాదని మండిపడ్డారు.

# మరో మూడ్రోజులు భారీవర్షాలు

**ఆరేంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ**



**హైదరాబాద్, ఆగస్ట్ 3 (సమ సమాజం):** రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతవరణ కేంద్రం హెచ్చరించింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. పలు జిల్లాల్లో అతి భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబాబాద్, సంగారెడ్డి, మెందక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. 5న కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. 6న రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయంటూ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, సిద్ధిపేట, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ ఎల్లో అరెల్ట్‌ను జారీ చేసింది. అలాగే గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

# ట్రై కలర్స్ కంపెనీపై ఐటీ దాడులు

**హైదరాబాద్, ఆగస్ట్ 3 (సమ సమాజం):** ట్రై కలర్స్ కంపెనీపై ఐటీ దాడులు నిర్వహించింది. దేశవ్యాప్తంగా 16 చోట్ల సోదాలు ఐటీ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. హైదరాబాద్ కేంద్రంగా ట్రై కలర్స్ రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు. అలాగే హైదరాబాద్‌లోని 10 ప్రాంతాల్లో ఐటీ అధికారుల సోదాలు చేపట్టారు. హైదరాబాద్, ముంబై, పాట్నా, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై సహా పలు పట్టణాల్లో ఐటీ తనిఖీలు నిర్వహించారు. విదేశాల్లో కూడా ట్రై కలర్స్ పెద్దఎత్తున ప్రాపర్టీ బిజినెస్ చేస్తున్నట్లు తెలసింది. ట్రై కలర్ సంస్థలో భారీగా నగదును ఐటీ గుర్తించింది.

# నరక కూపాలుగా ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు

- ప్రగతి భవన్ ను ముట్టడించిన ఇందిరా శోభన్, ప్రగతి భవన్ ముట్టడిలో పాల్గొన్న తెలంగాణ ఆప్ నేతలు, కార్యకర్తలు
- ప్రభుత్వ సంక్షేమ హాస్టల్‌లను పరిరక్షించండి : ఇందిరాశోభన్ సెర్చ్ కమిటీ చైర్ పర్సన్



**హైదరాబాద్, ఆగస్ట్ 3 (సమ సమాజం):** ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు విద్యార్థుల పాలిట నరక కూపాలుగా మారాయని ఆమ్ ఆద్మీ పార్టీ నేత ఇందిరా శోభన్ అన్నారు. ఆదివారం ఉదయం పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. పేద విద్యార్థులను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించడంతో పాటు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఎస్సీ, బీసీ, మైనార్టీ, గిరిజన హాస్టళ్ల పనితీరు అత్యంత అధ్వాన్నంగా మారిందని అన్నారు. ఈ దుస్థితికి ప్రభుత్వ ఆలసత్వం, అధికారుల పర్యవేక్షణలోపమే కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో విద్యా సంస్థలు, హాస్టళ్ల పనితీరును పరిశీలించాక కూడా తెలంగాణలో మార్పుకోసం ఏ మాత్రం ప్రయత్నించకపోవడం విద్యా వ్యవస్థ పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. ఆరోగ్యానివ్వాల్సిన భోజనాన్ని విషతుల్యంగా మార్చి అందజేస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ముఖ్యంగా గురుకుల హాస్టళ్ళలో పరిస్థితి అత్యంత అధ్వానంగా మారిందన్నారు. జూన్ 7న తెలంగాణ యూనివర్సిటీ హాస్టల్ లో ఆహారం బాగా లేదని మెస్ కి తాళం వేయగా, జూన్ 14 నుంచి 21 వరకు ట్రిపుల్ ఐటి బాసర విద్యార్థులు నిరసన దీక్షకు దిగిన విషయాన్ని గుర్తు చేశారు. జూన్ 27గద్వాల్ గట్టు మండలంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ లో 60 మంది విద్యార్థులు అస్వస్థత గురికాగా, జూన్ 27 సిద్దిపేట్ మైనారిటీ గురుకుల స్కూల్లో 128 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిందన్నారు. అలాగే జులై 10న అదిలాబాద్ ఇచ్చోడ బీసీ హాస్టల్ లో ఫుడ్ బాగాలేదని విద్యార్థులతో కలిసి తల్లిదండ్రుల ఆందోళన చేయగా, జులై 15న 600 మంది బాసర ట్రిపుల్ ఐటి విద్యార్థులు అస్వస్థత గురయ్యారని చెప్పారు. జులై 18న ముథోల్ బైంసా సంక్షేమ గురుకుల విద్యార్థులు భోజనం బాగాలేదని, మంచినీళ్లు ఇవ్వట్లేదని ఆందోళన చేయగా, గద్వాల్ బిగుదొడ్డి యూపీఎస్ స్కూల్లో మధ్యాహ్న భోజనంలో గొడ్డుకారం పెడుతున్నారని నిరసన దిగారని అన్నారు. అంతేకాదు స్వయంగా మంత్రి సత్యవతి రాథోడ్ ఇంచార్జ్‌గా ఉన్న మహబూబాబాద్ జిల్లాలో కేవలం నెలరోజులోనే కురవి గిరిజన బాలికల హాస్టల్, చిన్నగూడూరు హాస్టల్, మహబూబాబాద్ హాస్టల్లలో ఫుడ్‌పాయిజనింగ్ సంఘటనలు చోటు చేసుకున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విద్యార్తులకు పెట్టే టిఫిన్, ఆహారంలో బొద్దింకలు, జెర్రీలు, వానపాములు, బల్లులు వస్తున్నాయంటే హాస్టళ్లపై అంతులేని నిర్లక్ష్యం నెలకొందని విమర్శించారు. నిత్యం ఫుడ్ పాయిజన్ ఘటనలతో విద్యార్థులు తీవ్ర కడుపునొప్పి, వాంతులు విరోచనాలతో నరకయాతన అనుభవిస్తున్నారని, వారి ప్రాణాలకు రక్షణ లేకుండాపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక ఘటనల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం ద్వారా నే ఫుడ్ పాయిజన్ అయినట్లు గుర్తించినట్లు చెప్పారు. దీని కుళ్లిపోయిన కూరగాయాలు, పుచ్చిపోయిన పప్పులు, అపరిశుభ్ర వాతావరణంతో వంటలు చేయడమే కారణమన్నారు. ఇక ఏ ఒక్క హాస్టల్‌లోనూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదనే ఆరోపించారు. ఆయా సంక్షేమ హాస్టళ్లలో ఏదైనా ఘటన జరిగినప్పుడే హాస్టల్ ఉన్నతాధికారులు పర్యటనలతో హడావుడి చేసి.. ఏదో డిపార్ట్‌మెంటల్ ఎంక్వరీ చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. 90 శాతం పేద, మధ్య తరగతి విద్యార్థులే చదువుతున్న సంక్షేమ హాస్టళ్లను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. అసలు పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకోవడం సీఎం కేసీఆర్ ఇష్టం లేదన్నారు. బడ్జెట్ లో ఢిల్లీ ప్రభుత్వం విద్యా వ్యవస్థకు 20 శాతం నిధులు కేటాయిస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం కేవలం 6 శాతమే నిధులు కేటాయించి చేతులు దులుకుందని అన్నారు. పిల్లి చెలగాటం ఎలుకకు ప్రాణసంకటం అయినట్లు, విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వమూ, అధికారులు ఆటలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బంగారు తెలంగాణ అంటే పేద, మధ్య తరగతి విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేయడమేనా అని ప్రశ్నించారు. ఇప్పటికే సంక్షేమ హాస్టళ్లలో చదివే వేలాది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంక్షేమ హాస్టళ్ల పనితీరు మారకపోతే ప్రగతి భవన్ ను ముట్టడిస్తామని ఆప్ నేత ఇందిరాశోభన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ఆర్ సి ఓ గారిపై చర్యలు తీసుకోవాలి

మహాత్మ జ్యోతిరావు పూలే గురుకులాల నల్లగొండ ఆర్ సి ఓ గారిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం నల్లగొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ ఆర్ సి ఓ గారు గురుకుల పాఠశాలలను సందర్శించడం లేదని,దీనివలన పాఠశాలలు అస్తవ్యస్తంగా తయారయ్యాయని ఆరోపించారు. పాఠశాలలో కొంతమంది ప్రిన్సిపాల్ లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని, నాణ్యమైన భోజనం పెట్టడం లేదని,విద్యార్థులకు రావాల్సినటువంటి మెటీరియల్స్ అందజేయ లేదని, ఆర్ సి ఓ గారి పర్యవేక్షణ సరిగా లేకపోవడం కారణంగా ఇలాంటి సంఘటనలు పాఠశాలలలో జరుగుతున్నాయని ఆరోపించారు,అలాగే అర్ సి ఓ గారు నల్లగొండ పట్టణంలోని కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని,నెలకు ఒకటి లేదా రెండుసార్లు తప్ప సక్రమంగా కార్యాలయానికి రాకుండా కారణాలు చెబుతున్నారని విమర్శించారు.కావున ఆర్ సి ఓ గారి పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లేకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని అన్నారు.

# కొనసాగుతున్న ఉపరితల ద్రోణి



వరుస వర్షాలతో నగర జీవుల ఆందోళన•ఇంకా బురద నుంచి తేరుకోని పలు కాలనీలు

**హైదరాబాద్, ఆగస్ట్ 3 (సమ సమాజం):** ఉత్తర, దక్షిణ భారత ప్రాంతాల మధ్య ఏర్పడ్డ ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ మీదుగా శ్రీలంక సమీపంలోని కోమరీన్ ప్రాంతం వరకూ విస్తరించింది. మరోవైపు ఏపీ తీరంలో బంగాళాఖాతంపై 1500 మీటర్ల ఎత్తున గాలులతో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీంతో రాష్ట్రంలో నేడు, రేపు అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశా లున్నాయని వాతావరణశాఖ తెలిపింది. ఉత్తర, దక్షిణ భారత ప్రాంతాల మధ్య 900 మీటర్ల ఎత్తున గాలులతో ఉపరితల ద్రోణి ఏర్పడింది. ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ మీదుగా శ్రీలంక సమీపంలోని కోమరీన్ ప్రాంతం వరకూ విస్తరించింది. మరోవైపు ఏపీ తీరంలో బంగాళా ఖాతంపై 1500 మీటర్ల ఎత్తున గాలులతో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీంతో తెలంగాణ లో నేడు, రేపు అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ తెలిపింది. ఇదిలావుంటే రాజధాని నగరంలో మంగళవారం పలు చోట్ల భారీ వర్షం కురిసింది. ఖైరతాబాద్, పంజాగుట్ట, లక్డీకపూల్, అమీర్‌పేట, ముషీరాబాద్, చిక్కడపల్లి, రాంనగర్ ప్రాంతాల్లో వరుణుడి రాకతో వాహనదారులు తడిసి ముద్దయ్యారు. పలు ప్రాంతాల్లో పెద్దఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. మియాపూర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, మూసాపేట, ఎర్రగడ్డ, పంజాగుట్ట, ఖైరతాబాద్, లక్డీకాపూల్, మెహదీపట్నం, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఉప్పల్, సికింద్రాబాద్, బేగంపేట తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. గత కొన్ని రోజుగా కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు ఇంకా ముంపులోనే ఉండగా.. మరోసారి కురిసిన భారీ వర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిన్న నగరంలోని కవాడిగూడ, దోమలగూడ, భోలక్‌పూర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్, జవహర్‌నగర్, గాంధీనగర్, చాదర్‌ఘాట్, మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం ప్రాంతాల్లో వర్షం పడింది. రాజేంద్రనగర్, కిస్మత్‌పూరా, బండ్లగూడ జాగీర్, గండిపేట్, పుప్పాలగూడ, మణికొండ, అత్తాపూర్‌లోనూ వరుణుడు దంచికొట్టాడు. పలుచోట్ల రోడ్లపైకి వర్షపు నీరు ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జీహెచ్‌ఎంసీ సహాయక బృందాలు, ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి రహదారులపై చేరిన వర్షం నీటిని మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారు. బేగంపేట నుంచి సికింద్రాబాద్ వరకు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. వరద నీటిలో వాహనాలు నెమ్మదిగా కదులుతుండటం కూడా ట్రాఫిక్ సమస్యకు మరో కారణమైంది.

# రాజగోపాల్ రెడ్డి రాజీనామాతో వేడెక్కుతున్నరాజకీయం

ఢిల్లీకి వెళ్లనున్న ఈటెల, డికె అరుణ

మునుగోడుపైనా, చేరికలపైనా చర్చించే అవకాశం




**హైదరాబాద్, ఆగస్ట్ 3 (సమ సమాజం):** రాజగోపాల్ రెడ్డి రాజీనామాతో రాజకీయం వేడెక్కుతోంది. ఈ క్రమంలోమునుగోడు ఉప ఎన్నికకు బీజేపీసిద్ధమైంది. ఢిల్లీకి బీజేపీ ముఖ్యనేతలు ఈటల , డీకే అరుణ , వివేక్ తదితరులు వెళ్లనున్నారు. కేంద్రమంత్రి అమిత్ షా సహా.. బీజేపీ ముఖ్యనేతలను కలవనున్నారు. కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి చేరికకు హైకమాండ్ అనుమతి తీసుకోనున్నారు. అలాగే రాజగోపాల్‌రెడ్డి కాషాయ కండువా కప్పుకునే తేదీ ఢిల్లీ పెద్దలు నిర్ణయించనున్నారు. రాజగోపాలరెడ్డితో పాటు పలువురు నేతలు కాషాయ కండువా కప్పుకోనున్నారు. కాగా మునుగోడు ఉపఎన్నికను కమలనాథులు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మునుగోడును గెలిచి టీఆర్ఎస్, కాంగ్రెస్‌కు సవాల్ విసరాలని అమిత్ షా ఆదేశించినట్లు సమాచారం. కాగా మంగళవారం కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి కాంగ్రెస్? పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

## అంగన్‌వాడీ టీచర్లలకు చీరెలు పంపిణీ

**జనగామ, ఆగస్ట్ 3 (సమ సమాజం):** సీఎం కేసీఆర్ అంగన్‌వాడీలకు అండగా ఉంటున్నారని, అరకొర జీతాలతో ఇబ్బంది పడుతున్న వారి దయనీయస్థితిని చూసి రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచిందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు వారంరోజుల పాటు నిర్వహించే తల్లిపాల వారోత్సవాల సందర్భంగా పాలకుర్తి మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్టు కొడకండ్ల సెక్టార్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లకు చీరెలు, ఎదుగుదల లేని పిల్లలకు పౌష్టికాహారం బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డి.ఆర్.డి.ఓ రాంరెడ్డి, ఎంపీడీఓ అశోక్ కుమార్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రెడ్ల కబ్జాలో మునుగోడు మేలుకోవా బహుజన!

## ఆదిపత్య కులాల కబంధహస్తాల కింద బహుజన బతుకులు




బతుకులు మారాలంటే బాధలు తీరాలంటే... బహుజనుల రాజ్యాధికారం ఒక్కటే మార్గం. స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి నేటి వరకు పార్టీలు ఏవైనా, ప్రభుత్వాలను, పదవులను ఏలింది, పాలించింది ఆదిపత్య కులాలు మాత్రమే. బహుజన కులాలు మాత్రం రాజకీయ బానిసలుగా ఉండిపోయారు. అన్ని ప్రాంతాలు వేరు మునుగోడు గడ్డ వేరు. ఇక్కడి ప్రజలు అన్యాయాన్ని ఎదిరిస్తారు. ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నిస్తారు. అంతటి చైతన్యం ఉన్న గడ్డపై కూడా అగ్రవర్ణాలదే ఆదిపత్యం. రాజకీయంగా ఉన్నత పదవులు వారివే, ఎమ్మెల్యే పదవులు వారివే. అంతెందుకు ఒకప్పుడు మునుగోడు అంటే కమ్యునిస్టుల కంచుకోట, కమ్యునిస్టు పార్టీ అంటే పేదల పార్టీ అంటారు. పేదల పార్టీలో కూడా ఆ నాటి నుంచి ఆదిపత్య కులస్తులే ఎమ్మెల్యే పదవులను అనుభవించారు. ఏ పార్టీ చూసినా ఆదిపత్య కులాలకు ఎమ్మెల్యే టికెట్‌ను కెటాయించడం అనాదిగా వస్తున్న ఆచారంగా మారింది.

బానిస సంకెళ్లు తెంచుకొని బహుజనులంతా ఏకమై తమ ఓటు తమ వారికే అనే నినాదం, ఆ చైతన్యం ఇముడ్చుకోవడం ఇంకెప్పుడు. తరాలు మారినా బానిసత్వంలో మగ్గిన బహుజన బతుకులు రాజ్యాధికారం కోసం అడుగులు వేయడం అనివార్యం.



**నల్లగొండ, ఆగస్ట్ 3 (సమ సమాజం)** మునుగోడు నియోజకవర్గం అసెంబ్లీ జనరల్ సీటు కావడంతో, ప్రాంతీయేతరులు కూడా ఈ ప్రాంతం వైపు రాజకీయంగా మునుగోడు అసెంబ్లీ సీటుపై కన్నెస్తారు. 1967 నుంచి ఇప్పటి వరకు అగ్రవర్ణాల చేతులలో మునుగోడు నియోజకవర్గం పాలింపబడింది. ఏ పార్టీ, ఏ ఎన్నికలో కూడా ఇతరా కులాలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం, ఇక్కడి ప్రజలలో విష్మయానికి గురి చేసే అంశం. ఇప్పుడిప్పుడే రాజకీయలపై చైతన్యంతో బహుజనులకు జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు ఆలోచించి మునుగోడు టికెట్‌ను ఎస్సీ, బీసీ, మైనారిటీలకు కెటాయించాలని బహుజనులు కోరుకుంటున్నారు.

**నాటి నుంచి నేటి వరకు అగ్రవర్ణాల ఏలువడిలో మునుగోడు**

| | | |
|---|---|---|
| 1967-72 | పాల్వాయి గోవర్ధన్ రెడ్డి | కాంగ్రెస్ |
| 1972-78 | పాల్వాయి గోవర్ధన్ రెడ్డి | కాంగ్రెస్ |
| 1978-83 | పాల్వాయి గోవర్ధన్ రెడ్డి | కాంగ్రెస్ |
| 1983-85 | పాల్వాయి గోవర్ధన్ రెడ్డి | కాంగ్రెస్ |
| 1985-89 | ఉజ్జయిని నారాయణరావు | సీపీఐ |
| 1989-94 | ఉజ్జయిని నారాయణరావు | సీపీఐ |
| 1994-99 | ఉజ్జయిని నారాయణరావు | సీపీఐ |
| 1999-04 | పాల్వాయి గోవర్ధన్ రెడ్డి | కాంగ్రెస్ |
| 2004-09 | పల్ల వెంకట్‌రెడ్డి | సీపీఐ |
| 2009-14 | ఉజ్జయిని యాదగిరిరావు | సీపీఐ |
| 2014-2018 | కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి | టీఆర్ఎస్ |
| 2018-2022 | కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి | కాంగ్రెస్ |

# రాజగోపాల్ రెడ్డి రాజీనామాలో కాంగ్రెస్ అప్రమత్తం

- మధుయాష్కీ నేతృత్వంలో స్ట్రాటజీ కమిటీ ఏర్పాటు
- 5న మునుగోడులో విస్తృతస్థాయి సమావేశం
- ఇతరులు పార్టీని వీడకండా కదిలిన నేతలు



**హైదరాబాద్, ఆగస్ట్ 3 (సమ సమాజం):** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా ప్రకటనతో టీపీసీసీ అప్రమత్తమైంది. కాంగ్రెస్ నుంచి రాజగోపాల్‌రెడ్డితో ఎవరూ వెళ్లిపోకుండా.. మండల, గ్రామస్థాయి నేతలతో సీనియర్ నేతలు చర్చలు జరుపుతున్నారు. మధుయాష్కీ నేతృత్వంలో స్ట్రాటజీ, ప్రచార కమిటీ ఏర్పాటు చేశారు. ఈనెల 5న మునుగోడులో కాంగ్రెస్ కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ భేటీకి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, జానారెడ్డి, భట్టి విక్రమార్క, ముఖ్య నేతలు హాజరుకానున్నారు. ఉప ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నారు. ఇదిలావుంటే కాంగ్రెస్ పార్టీని, ఎమ్మెల్యే పదవిని వీడుతున్నట్లు ప్రకటించిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మరోమారు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలతో చేతులు కలిపి తెలంగాణ తల్లి సోనియా గాంధీకి వెన్నుపోటు పొడిచారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆయన రాజీనామాతో మునుగోడు ఉప ఎన్నికకు కాంగ్రెస్ సిద్ధమైందని, ఈ నెల ఐదో తేదీన మునుగోడులో విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రాజగోపాల్ రెడ్డిని మునుగోడు ప్రజలు సోనియాగాంధీ ప్రతినిధిగా గెలిపిస్తే.. ఆయన మాత్రం అవేవీ పట్టించుకోకుండా వారి నమ్మకాన్ని వమ్ము చేశారని మండిపడ్డారు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలేనని మరోసారి నిరూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజగోపాల్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఎంతో చేసిందని, ఎంపీగా ఓడిపోతే ఎమ్మెల్సీ పదవి ఇచ్చిందని, అది ఉండగానే ఎమ్మెల్యే సీటు ఇచ్చిందని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అంతే కాకుండా కేంద్ర జల్ శక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ లపై ఆగ్రహంతో రేవంత్ రెడ్డి ట్వీట్లు చేశారు. ఇవి ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారాయి. ఇకపోతే నూటికి నూరు శాతం ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కాంగ్రెస్ లోనే ఉంటారు. మునుగోడు ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ఆయన శ్రమిస్తారు. మాకు ఆయనపై సంపూర్ణ విశ్వాసం ఉంది. నీళ్ల విషయంలో తెలంగాణకు చాలా అన్యాయం జరుగుతోంది. వీటిపై సమాధానం చెప్పేంత వరకు బీజేపీని తెలంగాణ ప్రజలు నమ్మరు. తెలంగాణ ఏర్పాటును ప్రధాని మోడీ అవహేళన చేశారు. పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడిన తెలంగాణను తప్పుపట్టారు. మునుగోడు ఉప ఎన్నికకు కాంగ్రెస్ రెడీగా ఉందని రేవంత్ రెడ్డి అన్నారు. ఇదిలావుంటే మునుగోడు ఎమ్మెల్యే, కాంగ్రెస్ లీడర్ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన రాజీనామా పై క్లారిటీ ఇచ్చేశారు. కుండబద్దలు కొట్టినట్లు తాను కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం, ప్రజల కోరిక మేరకు రాజీనామా చేస్తున్నానని, డబ్బులు, పదవి కోసం అమ్ముడు పోనని స్పష్టం చేశారు. కష్టపడి వ్యాపారంలో సంపాదించిన సొమ్మును పేదలకు ఖర్చు చేశానన్న రాజగోపాల్ రెడ్డి.. నిజంగా తాను స్వార్థపరుడైతే 2018లోనే టీఆర్ఎస్‌లో చేరే వాడినని వివరించారు.





# చలన చిత్రం



## సమంత దృష్టి ఇప్పుడు శాకుంతలమ్ పైనే

'జాను' మూవీ తర్వాత సమంత నుంచి సినిమాలు కాస్త తక్కువగానే వస్తున్నాయి. మధ్యలో 'పుష్ప' పాటతో పలకరించింది. అందరి దృష్టీ ఇప్పుడు 'శాకుంతలమ్' పైనే ఉంది. ఇలాంటి సినిమాలు తీయడంలో గుణశేఖర్ ఎక్స్‌పర్ట్ కావడం, సమంత మొదటిసారి పౌరాణిక పాత్రలో నటిస్తూ ఉండటంతో అంచనాలు భారీగా ఉన్నాయి. అయితే ఈ మూవీ నుంచి ఒకట్రెండు తప్ప అంతగా అప్‌డేట్స్ రాలేదు. దాంతో ఫ్యాన్స్ డిజప్పాయింట్ అవుతున్నారు. నెక్ట్స్ అప్‌డేట్ ఎప్పుడు అంటూ ట్వీట్ల మీద ట్వీట్లు పెడుతున్నారు. దాంతో నిర్మాతల్లో ఒకరైన నీలిమ గుణ రియాక్టయ్యారు. 'ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ జరుగుతోంది. సీజీ వర్క్‌కి కాస్త ఎక్కువ టైమ్ పడుతోంది. బెస్ట్ ఔట్‌పుట్ ఇవ్వాలనే లక్ష్యంతో కాంప్రమైజ్ కాకుండా పని చేస్తున్నాం. అర్థం చేసుకుని సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాం' అన్నారామె. త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ ఇస్తామని కూడా చెప్పారు. అంటే శకుంతలగా సమంతని చూడటానికి మరికొన్నాళ్లు వెయిట్ చేయాల్సిందేనని అర్థమవుతోంది. సమంత మాత్రం ఈ సినిమాకి సంబంధించి తన పనులన్నీ పూర్తి చేసి ఇతర ప్రాజెక్టులపై దృష్టి పెట్టింది. యశోద, ఖుషి చిత్రాలతో పాటు 'సియాటెల్' వెబ్ సిరీస్‌లోనూ నటిస్తోంది సామ్.



## నాకు హిందీతో ప్రాబ్లమ్

అందుకే బాలీవుడ్ సినిమాలు చేయడం లేదు: నాగచైతన్య

అక్కినేని నాగ చైతన్య హీరోగా నటించిన బాలీవుడ్ మొదటి సినిమా 'లాల్ సింగ్ చడ్డా'. ఆమిర్ ఖాన్ , కరీన కపూర్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమా విడుదలకి సిద్ధమవుతోంది. తెలుగులో మెగాస్టార్ చిరంజీవి సమర్పణలో రిలీజ్ కాబోతోంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నారు నాగ చైతన్య. దీనిలో భాగంగా బాలీవుడ్ మూవీ ఆఫర్ వస్తే ఇంతకాలం ఎందుకు నో చెప్పారో క్లారిటీ ఇచ్చారు. చైతు ఇటీవలే విక్రమ్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన 'థాంక్యూ' మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. దాంతో నెక్ట్స్ సినిమాతో సక్సెస్ అందుకోవాలని చూస్తున్నారు చైతు. ఇందులో బోడి బాలరాజు అనే పాత్ర చేశారు. ఇక ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా మాట్లాడిన నాగ చైతన్య.. 'నిజానికి ఇంతకముందే నాకు కొన్ని బాలీవుడ్ సినిమాలలో నటించే అవకాశాలు వచ్చాయి. అయితే, నేను పుట్టిపెరిగిందంతా చెన్నై. ఆ తర్వాత హైదరాబాద్ కి షిఫ్ట్ అయ్యాము. నాకు హిందీ పెద్దగా అలవాటు కాలేదు.హిందీ భాషపై నాకు పెద్దగా పట్టులేదు. అందుకే, ఇంతకాలం వచ్చిన బాలీవుడ్ సినిమాలకి నో చెప్పాను'.. అని అన్నారు. 'ఇక ఇప్పుడు చేసిన లాల్ సింగ్ చడ్డా విషయంలో కూడా నేను ముందు నో అనే చెప్పాను. అయితే, ఇందులో బాలరాజు క్యారెక్టర్ సౌత్ నుండి నార్త్ వెళ్లిన ఆర్మీ వ్యక్తి ఇతివృత్తంతో సాగుతుంది. అలాగే, కథలో భాగంగా కొన్ని సీన్స్ లో తెలుగు పదాలు డైలాగ్స్ గా వస్తాయి. అందుకే, లాక్ సింగ్ చడ్డా ఒప్పుకున్నాను' అని క్లారిటీ ఇచ్చారు నాగ చైతన్య. చూడాలి మరి మొదటి బాలీవుడ్ ఎంట్రీ మూతో చైతూ ఎలాంటి హిట్ అందుకుంటారో.

## సీతారామం ప్రీ రిలీజ్ అట్రాక్షన్‌గా ప్రభాస్

పాన్ ఇండియన్ స్టార్ ప్రభాస్ 'సీతారామం' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి చీఫ్ గెస్ట్‌గా హాజరవబోతున్నారు. ఇక ఈ చిత్రాన్ని తెలుగు తో పాటు తమిళ, మలయాళ వెర్షన్స్ లోనూ విడుదల చేయబోతున్నారు. అయితే, విడుదల తేదీ దగ్గరగపడుతున్న ఈ సినిమా ప్రమోషన్స్ ని మేకర్స్ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఈరోజు నిర్వహించబోయో గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు పాన్ ఇండియన్ స్టార్స్ ప్రభాస్ గెస్టుగా హాజరవబోతున్నారు. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ మేకర్స్ సోషల్ మీడియా ద్వారా పోస్ట్ పెట్టారు. దీనిలో నేడు రాత్రి 7 గంటల నుంచి హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో 'సీతారామం' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ మొదలవనున్నట్టు... దీనికి ముఖ్య అతిథిగా ప్రభాస్ విచ్చేయనున్నట్టు పేర్కొన్నారు. భారీ అంచనాల మధ్య రిలీజ్ కాబోతున్న ఈ మూవీ ఎలాంటి సక్సెస్ సాధిస్తుందో చూడాలి. మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నటిస్తున్న రెండవ స్ట్రైట్ తెలుగు సినిమా ఇది. యుద్ధంతో రాసిన ప్రేమకథ దీనికి ట్యాగ్ లైన్. హనురాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో మృణాళ్ ఠాకూర్ కథానాయికగా, మరో స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న కీలక పాత్రలో నటించారు. స్వప్న సినిమాస్ బ్యానర్ పై, వైజయంతి మూవీస్ సమర్పణలో నిర్మించిన ఈ సినిమా ఆగస్ట్ 5న థియేటర్స్ లో రాబోతోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, సింగిల్స్, ట్రైలర్ మూవీపై భారీగా అంచనాలు పెంచాయి. ప్రకాష్ రాజ్, తరుణ్ భాస్కర్, మురళీ శర్మ, సుమంత్ , భూమిక ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ సినిమాలోని చాలా భాగం కశ్మీర్ లో చిత్రీకరించారు.



## పన్నుల చెల్లింపులో అక్షయ్ రికార్డు

పన్నులు చెల్లించడంలో ఎప్పుడూ నిరాడంబరతను చాటుకునే సూపర్‌స్టార్ అక్షయ్ కుమార్ ఈ సారి కూడా అత్యధిక పన్ను చెల్లింపుదారుడిగా రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ఆదాయపు పన్ను శాఖ కూడా ఇటీవలే ఓ హానర్ సర్టిఫికెట్ తో అక్షయ్ ను గౌరవించింది. ఈ విషయంపై నటుడు అక్షయ్ కుమార్ స్పందించారు. అత్యధిక పన్ను చెల్లింపుదారునిగా గుర్తించినందుకు తనకు నిజంగా చాలా గౌరవంగా, సంతోషంగా ఉందని తెలిపారు. ఈ విషయంలో ప్రజలకు క్రెడిట్ ఇవ్వడం గొప్ప అనుభూతిని కలిగించిందని అక్షయ్ చెప్పారు. అలాగే..'మీరు సంపాదించిన దాన్ని తిరిగి దేశానికి ఇవ్వడం మంచిది' అని సూచించారు. 2015, 2019లో అక్షయ్ కుమార్ ప్రపంచంలోనే అత్యధికంగా చెల్లించే ట్యాక్స్ పేయర్ గా ఫోర్బ్స్ జాబితాలో జాఅ 48.5 మిలియన్ (సుమారు రూ. 386 కోట్లు) సంపాదనతో 52వ స్థానంలో ఉన్నారు. సినిమాలే కాకుండా అక్షయ్ ఆదాయానికి ప్రధాన వనరు బ్రాండ్ ఎండార్స్‌మెంట్ల నుండి కూడా వస్తుంది. ఇక ఇటీవల ఆదాయపు పన్ను శాఖ సత్కరించిన తర్వాత.. అక్షయ్ అభిమానులు ఆయన్ని 'బాధ్యత గల పౌరుడు' గా అభివర్ణించారు.

## లగ్జరీ ఇంటిని అమ్మేసిన జాన్వీ

బాలీవుడ్ మీడియాలో వార్తలు చక్కర్లు

దివంగత నటి, అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టింది జాన్వీ కపూర్. నటనకు అవకాశం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ తనలోని నటికి పదును పెడుతోంది. దీంతో వరుస అవకాశాలు అందుకుంటూ హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం జాన్వీ పలు ప్రాజెక్ట్స్ బిజీగా ఉంది. ఇదిలా ఉంటే ఆమెకు సంబంధించిన ఓ ఆసక్తికర వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. తాజాగా జాన్వీ తన లగ్జరీ ఇల్లును అమ్మేసిందంటూ బాలీవుడ్ మీడియాల్లో వార్తలు వస్తున్నాయి.జూహులోని ఓ అపార్టుమెంట్‌లోని తన ఎ÷-లాట్‌ను భారీ ధరకు ఓ స్టార్ నటుడికి అమ్మినట్లు వార్తలు వినిపిస్తు న్నాయి. కాగా ఇటీవల ఆమె సోదరుడు అర్జున్ కపూర్ సైతం తన ఇల్లును అమ్మేసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. జూహు-విల్లె పార్లీ అనే అపార్ట్‌మెంట్‌లో గల 14, 15, 16 అంతస్థుల్లో నిర్మించిన ఈ లగ్జరీ ప్లాట్‌ను జాన్వీ 2020లో రూ. 35 కోట్లకు కొనుగోలు చేసిందట. 3456 బసా ఉన్న ఈ ఇంటిని ప్రముఖ నటుడు రాజ్ కుమార్ రావు రూ. 45 కోట్లకు సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. కాగా ఇటీవల రాజ్‌కుమార్ రావు, తన ప్రియురాలు, సహానటి పత్రలేఖను పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. పెళ్లి తర్వాత వీరిద్దరు ఉండేందుకు ఇంటి కోసం వెతుకుతుండగా జాన్వీని సంప్రదించాడు రాజ్ కుమార్. అప్పటికే తన లగ్జరీ ఎ÷-లాట్‌ను అమ్మాలని చూస్తున్న జాన్వీ రాజ్‌కుమార్‌కు అమ్మినట్లు బి-టౌన్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. జుహూలోని ఓ పెద్ద అపార్ట్‌మెంట్‌లో 14, 15, 16వ ఎ÷-లోర్లు కలిపి ఈ ప్లాట్ ఉంటుందట.



Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in